
# ధిక్కార స్వరం

## పంతుల జోగారావు



"అయ్యగారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అటెండరు భీముడి గొంతు.

నిర్లక్ష్యంగా, పొగరుగా, విసుగ్గా తలెత్తి చూసేడు వామనరావు.

"ఎవడ్రా అయ్యగారు!... రాను పొమ్మన్నానని చెప్పు" అరిచినట్టుగా అన్నాడు వామనరావు. అతని గొంతులోని తీవ్రతకీ, విసురుకీ ఆ చిన్న ఆఫీసు గదిలోని చిరుద్యోగులంతా హడలెత్తి పోయేరు. ఒకేసారి అందరి చూపులూ వామనరావు మీద పడ్డాయి. అతని ధైర్యానికి అబ్బుర పడ్డారు. అతని తెగువకి చకితులయ్యేరు. అతని తిరుగుబాటుకి సంతోషంతో తలమునకలయ్యేరు. అంతా మెచ్చుకోలుగా అతనివేపు చూసేరు. దాదాపు అందరూ తనవేపు ఆరాధనాభావంతో చూడడం గమనించి వామనరావు మనసు పొంగిపోయింది.

మొత్తంమీద ఆ చీకటి గుయ్యారం లాంటి ఆఫీసు గదిలో ఒక్క సారిగా ఓ కొత్త వెలుతురు పరుచుకున్నట్టయింది. ఓ నూతనోత్తేజం అలుముకున్నట్టయింది. ఆ వెలుగుని వామనరావు పోల్చుకోగలిగేడు. ఆ ఉత్తేజం వెదజల్లిన కైపుని ఆస్వాదించగలిగేడు. అతనికిదంతా కొత్తగా ఉంది. అయినా, గమ్మత్తుగానే ఉంది. అతనే గర్వించేడు. అతని ఛాతీ పొంగినట్టయింది. అతని పాలిపోయిన పెదాల మీద చిరునవ్వు మొలకెత్తింది. అతనొక క్షణంసేపు నేలకి మూరెడు ఎత్తుకి తను ఎదిగిపోయినట్టనిపించింది. వామనుడు త్రివిక్రముడైనట్టు భావించేడు. సంతోషించేడు.

అప్పుడతని మాటలో – ఝుళిపించిన కొరడా కొస నుంచి వినిపించే ఛళ్‌మనే చప్పుడు చేసే తీవ్రత ఉంది.

అప్పుడతని మాటలో – లాఘవంగా త్రిప్పుతున్న కత్తి పదును ఉంది.

ఆ మాట తను అనగలిగినందుకు అతని మనసు దూది పింజెలా తేలికయింది. తరతరాల దుమ్ము వదిలిపోయినట్టయింది.

"మిమ్మల్నే,... అయ్యగారు రమ్మంటున్నారని చెబితే అలా చూస్తారేం! వినబడలేదా? అసలే అయ్యగారు కోపంతో శివాలెత్తిపోతున్నారు"

ఇప్పుడిదీ భీముడి గొంతే!

ఇప్పుడు వాడి గొంతు కర్కశంగానూ, విసుగ్గానూ, దులపరిస్తున్నట్టు గానూ ఉంది.

ఇప్పుడా గొంతు గొంగళిపురుగును గొరక చీపురుతో విదిలించి కొట్టేదిగానూ ఉంది.

ఊహాలోక విహారం చాలించి, వామనరావు ఒక్కసారిగా వాస్తవంలోకి వచ్చేడు. భయం కర్రిమబ్బులా అతనిని నిలువెల్లా ఆవరించింది. వజవజా వణికిపోయేడు. గొంతు తడారిపోయింది. ముఖంలోకి రక్తం ఎగజిమ్మింది.

అప్పుడతను కలల స్వర్గంలోంచి వైతరణిలోకి నిర్దయగా విసిరి వేయబడిన మహాపాపిలా ఉన్నాడు. నత్తగుల్లలో ముడుచుకుపోయిన నత్తలా ఉన్నాడు. చక్రంలా చుట్టుకున్న

రోకలి బండలా అసహ్యంగానూ ఉన్నాడు. అతని ముఖంలో ప్రేత ముఖంలో ప్రేతకళలాంటిది చోటు చేసుకుంది. అంగుష్ఠ మాత్రుడిలా వంగిపోయేడు. క్రుంగిపోయేడు. మొత్తమ్మీద అతను పురుగుకన్నా మెరుగ్గా ఏమీ లేడు.

"వ... వ.... వస్తున్నాను..." నంగి నంగిగా, భయం భయంగా, బెదురు బెదురుగా లేచాడు. అతనంత సేపూ కూర్చున్న పాత కుర్చీ కిర్రుమంది. 'తెలివి తెచ్చుకోరా నాయనా' అన్నట్టుగా ఓసారి గిచ్చింది. దానికున్న పాత మేకు తగిలి అతనికున్న ఆ ఒక్క మంచి చొక్కా కొంతమేర ఫర్రుమంది. అతనది పట్టించుకునే స్థితిలో లేడు.

లేచాడే కానీ, వామనరావుకి నడవడానికి అతని శరీరం సహకరించడం లేదు. ఎలాగో శక్తి కూడదీసుకుని అయ్యగారి గదివేపు అడుగులు వేసాడు. వెళ్తూ వెళ్తూ ఓసారి గదంతా కలియచూసేడు. అక్కడెవరూ తనని గమనించడం లేదు. ఫైళ్ళలో తలలు దూర్చుకుని, ఉష్ట్రపక్షుల్లా ఉన్నారు. ఆ పాతకాలపు భవనంలో, ఆ గదిలో - దుమ్ము పేరుకు పోయిన ఫైళ్ళ మీద నుంచి, అలమరా అరల్లోంచి, చెమ్మతో నాని పోయిన గోడల్లోంచి - ఓ విధమయిన ముతక వాసన వేస్తోంది. అలవాటు పడిన వాసనే అయినా, అతనికిప్పుడు కడుపులో తిప్పినట్టవుతోంది. తల దిమ్ముగా తయారయింది.

తడబడే అడుగులతో అయ్యగారి గది సమీపించేడు వామనరావు.

***

చీకటి చిక్కగా అలుముకుంది. వీధి దీపాలు చీకటిని చిమ్మలేక చతికిలబడి మిణుకు మిణుకుమంటున్నాయి. దేదీప్య మానంగా వెలిగే దీపాల తోరణాల మధ్య, మిరుమిట్లు గొలిపే షాపింగ్ మాల్సుని యీదుకుంటూ, చివరికా యిరుకు గొందిలోకి వచ్చిపడ్డాడు వామనరావు. అక్కడికతని యిల్లు ఎంతో దూరంలో లేదు. బికారిలా హీనంగానూ, దగాపడ్డ మనిషిలా దీనంగానూ ఉంటుందది.

కొంప సమీపిస్తున్న కొద్దీ వామనరావులో అలజడి అధికం కాసాగింది. ఇంట్లో అడుగుపెట్టాలంటే అతనికి భయంగా ఉంది. కొద్దిరోజులుగా అతనొక తీవ్రమయిన సమస్యని ఎదుర్కొంటున్నాడు. పరిష్కారం తెలీదు. కర్తవ్యం బోధపడదు. దిగులు దిగులుగా ఉంటోంది. భయం భయంగా ఉంటోంది.

అతని మనసంతా కలవరంగా ఉంది. దానికి తోడు, యిందాక గదిలోకి పిలిచి అయ్యగారు తిట్టిన తిట్లతో అతని మెదడు శూన్యమైపోయింది. అదేమీ కొత్తకాదు. రోజూ ఉండేదే. చాన్నాళ్ళగా ఆ తిట్లకి అలవాటు పడిపోయి మౌనంగా భరించగల శక్తిని సంతరించుకున్నాడు. అయితే, ఇవాళ తన మనస్థితి వేరుగా ఉంది. మనసు తిరుగుబాటు చేస్తోంది. ఆ తిరుగుబాటు కార్యరూపం దాల్చడం లేదు. అందుకే అతనెంత తిడుతున్నా బదులు చెప్పలేదు. ఆ మౌనం అయ్యగారిని మరింత గంగ వెర్రులెత్తించింది. మరికొన్ని తిట్లు యివాళ అదనంగా అతని నోటినుండి జలజలా రాలేయి. వాటిని పదిలంగా ఏరుకుని, తిరిగి తన సీటు దగ్గరికొచ్చేడు. అతడిని అప్రమత్తం చేయడం కోసం కుర్చీ మరోసారి గిచ్చింది. "దీనమ్మ!" తొలిసారిగా ఓ తిట్టు అతని నోటి నుండి బయటికొచ్చింది. ఆ తర్వాత ఆఫీసు పనిగంటలు ముగిసే వరకూ ముళ్ళ మీద కూచున్నట్టుగా గడిపి, బయటపడ్డాడు.

వామనరావు తన యింటి సందు దగ్గరికి వచ్చి, అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టుడైపోయేడు. తనుండే వీధిలో ఆ చివరనుండీ యీ చివర వరకూ దారి మూసుకుపోయి ఉంది. యీ కొసనుండి ఆ కొస వరకూ షామియానాలు వేసారు. టేబిళ్ళూ కుర్చీలూ వేసారు. ఇటూ అటూ ఆ వీధిని మూసేస్తూ వాల్ డ్రాప్స్ కట్టేరు. లోపల ఏదో భోజన కార్యక్రమం జరుగుతున్నట్టుంది. దానికోసం మాత్రం తమ చిన్నసందునంతా బ్లాక్ చేసారు. ఎవరూ ఆ కార్యక్రమం పూర్తయే వరకూ ఆ సందులో ప్రవేశించడానికి వీల్లేకుండా చేసేరు. అటువేపు రాకపోకలు తాత్కాలికంగా అనధికారికంగా బంద్ చేస్తున్నట్టు తెలియడం కోసం వీధికి రెండు చివర్లా కొంచెం దూరంలో పెద్ద పెద్ద రాళ్లు కూడా పెట్టేరు. అంతా బాగానే ఉంది. యేర్పాట్లు సరిగానే చేసారు. కానీ వాళ్ల యింట్లో కార్యక్రమం కోసం జనాలను యిలా యిబ్బందుల పాలు చేయడం ఎంత దారుణం! ఎవరికీ ఇంతవరకూ ఆ సంగతి పట్టినట్టు లేదు. అంతవరకూ రావడం, దారి మూసుకు పోయినట్లు గమనించి, ఓసారి చిరాగ్గా తలాడించి, వెనక్కి తిరిగి వేరే వీధులోనుంచి



పోవడం చేస్తున్నారు. ఎవరయినా ఇదేం ధర్మమని అడిగిన పాపానికి పోలేదు. ఇప్పుడు తను కూడా ఆ యిరుకు సందులో నాలుగయిదు యిళ్ళ తర్వాత వచ్చే తన కొంపకి చేరుకోవాలంటే, చుట్టూ నాలుగు వీధులు చుట్టబెట్టి అటువేపు నుండి వెళ్ళాలి తప్ప మరో మార్గం లేదు. షామియానాకి ఆ చివర ఉంది తన యిల్లు. వామన రావుకి వొళ్ళు మండి పోతోంది. కోపం కట్టలు తెంచుకువస్తోంది. షామియానా సందు లోంచి ఓ ముఖం కనబడితే అడిగి తెలుసుకున్నాడు. ఏదో పితృకార్యం జరుగుతోందిట. భోజనాలు పెడు తున్నారు. మరికాస్సేపటిలో భోజనాలు చెయ్యడం పూర్తయేక అడ్డు తొలగిస్తారట. తాము చేసేది పితృ కార్యం కనుక కొంచెం అసౌకర్యాన్ని సహృదయంతో అర్థం చేసుకోమని కోరేడు. చేసేది లేక వామనరావు వెనుదిరిగేడు. ఇంతలో అక్కడేదో గొడవ ప్రారంభమై నట్టుగా ఏవో కేకలు వినిపించాయి. రోడ్డంట పోయే జనంలో ఎవరో ఒకాయన వాళ్ళతో గొడవకి దిగిన ట్టుంది. వామనరావు ఆగి, కుతూహలంగా మళ్ళీ వెనక్కి వచ్చేడు. రాను రాను వారి మధ్య వివాదం ముదిరింది. మరి కాస్సేపటిలోనే అక్కడ చాలా మంది పోగయ్యేరు. గొడవ శ్రుతిమించింది. తక్షణమే అడ్డు తొలిగింది వెళ్లేవారికీ, వాహనాలకీ దారివ్వాలని కొందరు పట్టుబడుతున్నారు. భోజనాలు మరికాస్సే పటిలో ఎలాగూ పూర్తవుతాయి కనుక అంతవరకూ దారికి అడ్డు తొలిగించేది లేదని అవతలి వాళ్ళు తెగేసి చెబుతున్నారు. పోలీస్ కంప్లయింట్ చేస్తామని వీళ్ళంటే దిక్కున్న చోటుకి పోయి చెప్పుకోమని వాళ్ళు మొండికేసారు. ఎవరూ దిగి రావడం లేదు. ఆ కార్యం చేస్తున్న వాళ్ళు బాగా పలుకుబడి గలవారిగానే కనిపి స్తున్నారు. అందుకే ఈ బెదిరింపులకి జడవడం లేదు. చూస్తూండగానే అక్కడంతా నానా బీభత్సంగానూ తయారయింది. కేకలతో వీధి వీధంతా దద్దరిల్లిపో తోంది. వామనరావులో కొంచెం తెగింపు వచ్చింది.

''రేయ్ ఈ వీధి మీ అబ్బ సొత్తనుకున్నారా! వీధి మొత్తం బ్లాక్ చేసి పారేసేరు పీకెయ్యండి షామియా నాల్ని'' అని అరిచేడు.ఆ గోలలో అతని గొంతెవరికీ వినబడలేదు. బహుశా ఆ భరోసా తోనే అలా అరిచా డేమో కూడా! ఏమయితేనేం... వామనరావు జీవి తంలో తొలిసారిగా తన గుండెలోని మంటని బహి ర్గతం చెయ్యగలిగేడు. అతనికప్పుడు మనసు తేలిక పడింది. ఆ గలాటా మధ్య ఎవరి దృష్టిలోనూ పడ కుండా తనా కేక వెయ్యగలిగినందుకు వామనరావు తనని తనే అభినందించుకున్నాడు.

వామనరావు తనలో చెలరేగే భావాలను మాట రూపంలో వ్యక్తపరచడం బహుశా యిదే తొలిసారి కావచ్చు. ఎప్పుడూ ఆ సాహసం చెయ్యలేదు. జ్ఞాన మొచ్చింది లగాయతు పిరికి పిరిగ్గానే గడిపేడు.

తాగుడికీ, యితర వ్యసనాలకీ వందలాది రూపా యలు ఖర్చు చేసే తండ్రి – తన చదువు విషయంలో మాత్రంలేదు పొమ్మంటే మౌనంగా రోదించాడే తప్ప, ఎదురు చెప్పలేక పోయేడు. స్కూల్లో మేష్టారు తన తప్పూ లేకపోయినా చితకబాదిన రోజున ఆ దెబ్బలికి ఓర్చుకున్నాడే కానీ తన తప్పు లేదని చెప్పలేకపోయేడు ఆఫీసులో ఏళ్ళ తరబడి ఒకే సీటుకి తనని పరిమితం చేసి ఏడిపిస్తున్నా కిక్కురుమనలేకపోతున్నాడు.

ఓసారి ఓ ప్రముఖుని కాన్వాయ్‌కి అడ్డంగా పొరపా టున సైకిలుమీద వెళ్తూ ఉంటే సెక్యూరిటీ సిబ్బంది అతన్ని విసిరి కొట్టారు. సైకిలుతో సహా వెళ్ళి దూరంగా పొలాల్లో పడ్డాడు. చిన్న చిన్న దెబ్బలు కూడా తగి లేయి. అప్పుడు కూడా కనీసం మనసులోనైనా వాళ్ళని తిట్టుకోడానికి వామనరావుకి ధైర్యం చాలింది కాదు.

వీధిలో పక్కింటాయనా, పచారీ కొట్టువాడూ, ఇంట్లో ఏదో రిపేరు చెయ్యడానికొచ్చే మెకానిక్కూ, కూరగాయలమ్మే ముసిలావిడా, ఆఖరికి పనిమనిషీ... ఎవరయితేనేం! ... వాళ్ళ చూపుడు వేలు తనకి గురిపెట్టి నప్పుడు తల దించుకోవడమే చేస్తాడు తప్ప – తల అడ్డంగా తాటించడం చెయ్యని వ్యక్తి వామనరావు. అలాంటి వామనరావు తొలిసారిగా – ఎవరూ పట్టించు కోక పోతేనేంగాక! కసితీరా తిట్టగలిగేడు! అదే పదివేలు!

మరికాస్సేపటికి గొడవ చల్లారింది. ఆ యింటి వాళ్ళు దిగిరాక తప్పలేదు. తక్కిన భోజనాలు సమీ పంలోని ఓ యింట్లో పెట్టుకోడానికి ఒప్పుకొని రోడ్డు మీద అడ్డంకులు తొలిగించేరు. షామియానాలు తీసే సారు. ఈ ప్రజావిషయంలో తన భాగస్వామ్యాన్ని మననం చేసుకుంటూ ఇంటికి చేరాడు వామనరావు.

ఇంట్లోకి అడుగు పెడుతూనే వామనరావుని కొద్దిరో జులుగా వేధిస్తున్న కలతలు మళ్ళీ చుట్టుముట్టి కందిరీ గల్లా బాధించసాగేయి. ఇంట్లోకి వెళ్తూనే భార్య ఎక్క డుందా అని చూసేడు. కూతురి కోసం కూడా అతని కళ్ళు ఆత్రంగా వెతికేయి. భార్య వంట గదిలో పనిలో ఉంది. అతని రాకని గమనించి కూడా ఆమె పట్టనట్టే ప్రవర్తిస్తోంది. కూతురు ప్రసన్న ఇంట్లో ఉన్నట్టు లేదు.

వామనరావు బట్టలు మార్చుకుని, ఉస్సురంటూ కుర్చీలో కూలబడ్డాడు. అతని తల పగిలిపోతోంది. భార్య కాఫీ యిచ్చే జాడ కనిపించడం లేదు. ఆ యింట్లో దాదాపు వారం రోజులుగా ఒక భయంకర మైన నిశ్శబ్దం తాండవిస్తోంది. ఏం జరుగుతోందో, ఏం జరగబోతోందో అంతుబట్టడం లేదు. ఒక విషాద కరమైన అనిశ్చితి అందర్నీ వెంటాడి వేధిస్తోంది.


ప్రసన్న జీవితం ఎలాంటి మలుపులు తిరగబో తోంది? పెళ్లి కావలసిన పిల్ల. ఈ చిక్కుల్లోంచి సురక్షి తంగా బయటపడగలదా? అదే వామనరావుని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న విషయం. ప్రసన్నకి ఆ సుధీ ర్‌తో పరిచయం రెండేళ్ళనుండీ ఉందన్న సంగతి తొలిసారిగా తెలిసినపుడు దిగ్భ్రాంతికి లోనయేడు. ఓ ప్రక్క కూతురి మీద కోపం కట్టలు తెంచుకు వస్తున్నా. ఆమెని ఏమీ అనలేడు. వామనరావు భార్య మాత్రం యింట్లో పీనుగు లేచినట్టుగా నిత్యం శోకాలు పెడు తూనే ఉంది. ప్రసన్నని తిట్టి పోస్తోంది. కొట్టినంత పని చేసింది కూడా. ప్రసన్న తల్లిదండ్రుల మాటలకి వేటికీ సమాధానం చెప్పలేదు.

రెండేళ్ళ పరిచయాన్ని రెండు క్షణాల్లో కాదనగలిగేడు. ఆ సుధీర్, ఎంత పొగరు! ఎంత నిర్లక్ష్యం! గొప్పింటి బిడ్డ కావడం వల్ల వొచ్చిన తెగువ కాబోలు! సుధీర్ తండ్రికి ఊళ్లో గొప్ప పలుకుబడి ఉంది. ఎన్నో వ్యాపారాలున్నాయి. ఎంతో మంది అధికారులతోనూ, రాజకీయవేత్తలతోనూ పరి చయాలున్నాయి. తనేం చేసినా చెల్లుతుందనే ధీమా పుష్క లంగా ఉంది. అలాంటి వ్యక్తిని ఎదిరించబోతోంది తన బిడ్డ. తట్టుకోగలదా!... తట్టుకుని అతన్ని దారికి తెచ్చుకోగలదా? ఈ అల్లరితో దాని బ్రతుకు ఛిద్రం కాదు కదా? వామనరా వుని రాత్రీ పగలూ కొన్ని దినాలనుండి వేధిస్తున్న ప్రశ్నలివి.

ఒక్కోరోజు నిద్రలో మెలకువ వచ్చి, తుళ్లిపడి లేస్తాడు. కూతురు మంచంమీద ఉందో లేదో అని అను మానంగా లైటు వేసి చూస్తాడు. ఏ అఘాయిత్యమో తలపెట్టలేదు కదా అని బెంబేలు పడిపోతాడు.

ప్రసన్న ఏం చెయ్యబోతోందో అతనికర్థం కావడం లేదు. రోజూ ఎక్కడికో వెళ్ళి వస్తోంది. ఎవరెవరినో కలుస్తోంది. ఆమె కోసం ఎవరెవరో వస్తున్నారు. వచ్చి నవాళ్ళలో స్త్రీలే ఎక్కువ. ఏవేవో చర్చిస్తున్నారు. ఏవో రాస్తున్నారు. ఎక్కడికో వెళ్లి వస్తున్నారు.

వామనరావుకిదేమీ అంతుబట్టడం లేదు. అతడిని భయం భల్లూకంలా పట్టుకుని పీడిస్తోంది. పెద్దవా ళ్ళతో తన కూతురు తలపడబోతోందా యీ ఆలోచన రాగానే అతను నిలువునా వణికిపోతున్నాడు. కూతు రుకి నచ్చచెప్పాలనుంది. జరిగిందేదో జరిగింది. ఈ ఊరికి దూరంగా ఎక్కడికైనా పోదాం అని ఆమెతో అనాలనుంది.. కూతురి ముఖంలోకి దీనంగా చూస్తాడు. నోటమ్మట మాట పెగలదు. చెప్పాలను కున్న మాటలు గొంతులోనే మిగిలిపోతాయి. తండ్రి



అవస్థ ప్రసన్న గమనించకపోలేదు.

''బెంగ పడకండి నాన్నా...'' అని మాత్రం ఓసారి అంది.

అలాంటి స్థితిలోనూ ఆమె అంత నిబ్బరంగా ఎలా ఉండగలుగుతోందో వామనరావుకి అబ్బురమే!

అతనికి తనమీద తనకే అసహ్యం వేస్తోంది. తన చేతగాని తనం మీద తనకే రోత కలుగుతోంది. ఎన్ని అయిష్టతలనయినా, ఎన్ని అవమానాలపాలయినా మౌనంగా, పిరికిగా భరించడమే తప్ప – మనసులోని మాటని బయటపెట్టలేని తన అసమర్థత మీద అతనికి ఏవగింపు కలుగుతోంది.

కళ్ళముందు జరుగుతున్న అన్యాయాలని గొంతెత్తి ఖండించాలనుకుంటాడు. నచ్చని వ్యక్తిలోని నచ్చని గుణాన్ని అతని ముఖంమీదే ఫెడీల్మని చెప్పేయ్యాలనుకుంటాడు. ఏమీ చెయ్యలేక తనలో తనే ముడుచుకుపోతాడు.

ఇంతకీ ప్రసన్న ఏం చెయ్యబోతోంది...

***

మర్నాడే ప్రసన్న ఏం చెయ్యబోతోందో వామనరావుకి తెలిసిపోయింది. అతను నివ్వెరపోయేడు ఒక శూన్యం అతని మెదడంతా ఆక్రమించింది.

సుధీర్ యింటిముందు తనకి న్యాయం జరగాలని కోరుకుంటూ ప్రసన్న నిరసన దీక్షకి కూర్చుంది! ఆమెకి మద్దతుగా చుట్టూ చాలామంది చేరారు. క్రమేపీ, ఆమెకి న్యాయం జరిగి తీరాల్సిందే అని న్యాయపోరాటానికి అనుకూల నినాదాలు జోరందుకుంటున్నాయి. అక్కడ జరుగుతున్న తతంగాన్ని చూస్తూ వామనరావు విస్తుపోయేడు. భార్య కూడా ప్రసన్న పక్కనే కూర్చుని ఉంది. వామనరావు ఎటూ పాలుపోనట్టుగా అక్కడే తచ్చాడుతున్నాడు. ఇదంతా చివరికి దేనికి దారి తీస్తుందో అతనికి అర్థం కావడం లేదు. తన కుటుంబం వీధిన పడిపోయింది అనిపించిందతనికి. దుఃఖం తన్నుకొస్తోంది. సుధీర్ కుటుంబంతో తలపడగలిగే సత్తా తమకుందా! ప్రసన్నకి చివరకి న్యాయం జరుగుతుందా? ఈ ధిక్కారస్వరం మధ్యలోనే మూగబోదు కదా... అతని ఆలోచనలన్నీ గజి బిజిగా తయారయేయి. ఆ మధ్యాహ్నానికి ఆ సంఘటన తీరు తెన్నులు పూర్తిగా మారిపోయేయి. ప్రసన్న పోరాటం ఓ కొత్తరూపం సంతరించుకుంది. పత్రికలవాళ్ళూ, టీవీల రిపోర్టర్లూ వచ్చి చేరారు. ప్రసన్నతో ఆమె డిమాండ్స్ గురించీ, ఆమె చేస్తున్న ఆరోపణల గురించీ ఆమెని అడిగి తెలుసుకుంటున్నారు... మరికాస్సేపట్లో లక్షలాది ప్రజలు ఆమె వినిపించే నిరసన గళం వింటారు కాబోలు. వామనరావుకి ఉత్కంఠగా ఉంది. భయంగా ఉంది.

ప్రసన్న దీక్ష క్షణ క్షణానికీ రకరకాల మలుపు తిరుగుతోంది. చాలా సేపటివరకూ సుధీర్ కుటుంబ సభ్యులు అసలు స్పందించనే లేదు. వాళ్ళమీద ఒత్తిడి రాను రాను అధికం కావడంతో కొంచెం కదలిక మొదలయింది. సుధీర్ మొదట్లో ఆమె గురించి, ఆమె నడవడికి గురించీ కూడా కొంచెం దురుసుగానూ, నీచంగానూ ఆరోపణలు చెయ్యడానికి ప్రయత్నించేడు. కానీ ఆందోళన చేస్తున్న వాళ్ళ ఆగ్రహానికి జడిసి మాట మార్చేడు. ఆమె తనకి రెండేళ్ళుగా తెలిసినప్పటికీ ఎప్పుడూ ఆమెని పెళ్లి చేసుకునే ఉద్దేశం తనకి లేదని వాదించడం మొదలెట్టాడు. ఆమె కడుపులో రూపు దిద్దుకుంటున్న బిడ్డకీ తనకీ ఎలాంటి సంబంధం లేదని బుకాయించేడు.

ప్రసన్న దీక్ష మూడో రోజుకి తీవ్ర రూపం దాల్చింది. ఈ మధ్యలో వామనరావుకి కొన్ని అభ్యర్థనలు, వేడికోళ్లు వచ్చేయి. కొన్ని బెదిరింపులు, హెచ్చరికలూ కూడా వచ్చేయి. దాంతో వామనరావు వణికిపోతున్నాడు. బెదిరిపోతున్నాడు. పత్రికలవాళ్ళూ, టీవీల వాళ్ళూ అతనిని గుచ్చి గుచ్చి ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నాడు. వామనరావు గొంతు పెగలడం లేదు. బిక్కచచ్చిపోయినట్టు అయోమయంగా చూస్తూ ఉండిపోయేడు. అతని మౌనాన్ని – 'ఆ తండ్రికి తన కుమార్తెకి జరిగిన అన్యాయంతో గొంతు మూగబోయింది. మౌనంగా రోదిస్తున్నారు. ఆ విషాద మౌనవేదన గుండెలు జలదరింప చేస్తోంది...'' లాంటి కథనాలతో పత్రికలలో వార్తలు వెలువడ్డాయి. టీవీల్లో లైవ్ టెలికాస్ట్ చేస్తున్నారు.

సుధీర్ తనకి చేసిన అన్యాయానికి బలమైన ఆధారాలు చూపిస్తూ ప్రసన్న తన వాదనని గట్టిగా వినిపిస్తోంది. అతను తన తప్పు ఒప్పుకుని, తనని వివాహం చేసుకోవలసిందే అనీ, తనకి పుట్టబోయే బిడ్డకి తండ్రిగా బాధ్యతలు తీసుకోవలసిందే అని పట్టుబడుతోంది. అంతవరకూ తన దీక్ష విరమించే ప్రశ్నే లేదని తెగేసి చెబుతోంది. పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది.

***

నాలుగోరోజు ఉదయానికి ప్రసన్న దీక్షకి తెర పడింది. మొత్తానికి ఎలాగయితేనేం సుధీర్, అతని కుటుంబ సభ్యులు పూర్తిగా తమ పట్టు సడలించుకున్నారు. సుధీర్ తన తప్పు అంగీకరించి, ఆమెను వివాహం చేసుకోడానికి అంగీకరించేడు. ఆ పరిణామంతో అందరి ముఖాల్లోనూ సంతోష రేఖలు వెల్లివిరిసేయి. ఆనందం పట్టలేక ఒకరికొకరు అభినందించుకున్నారు.

అంతవరకూ నరాలు తెగే ఉత్కంఠతో స్థాణువై ఉండిపోయిన వామనరావులో చలనం మొదలయింది.

ప్రసార మాధ్యమాల వ్యక్తులు వామనరావుని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేసారు. రకరకాల ప్రశ్నలు సంధించేరు.

''మీ అమ్మాయి న్యాయపోరాటం విజయవంతమైంది. అభినందనలు. సుధీర్ ఆమెని వివాహం చేసుకోడానికి అంగీకరించేడు కదా, దీనిపై మీరెలా స్పందిస్తారు?...'' ఎవరో అడిగేరు.

ఆ ప్రశ్నకి వామనరావు ఓ క్షణం జవాబు చెప్పలేదు. అతని ముఖంలో రకరకాల భావాలు వ్యక్తమవుతున్నాయి. అతని తనలో ఏవో నిశితమైన ఆలోచనలు గింగిర్లు తిరుగుతున్నాయి. మనసులో ఘర్షించే ఆలోచనలు క్రమేపీ ఒక నిశ్చితాభిప్రాయంగా రూపు దాల్చడానికి కొన్ని క్షణాలు పట్టింది. సకాలంలో స్పందించడానికి చిన్నప్పటినుండీ ఎప్పుడూ సహకరించని అతని గొంతు నెమ్మదిగా విడింది . ఒక్కోమాటా పేర్చుకుంటున్నట్టుగా, అయినా, స్పుటంగానే అన్నాడు : ''ఇంత పెనుగులాట తర్వాత, యింత పోరాటం తర్వాత... మా ప్రసన్న సాధించిన విజయం నాకు సంతోషాన్ని కలిగించింది. అయితే.. యిదొక ఆహ్లాదకరమైన ముగింపుగా మాత్రం నేను భావించలేను. అనివార్యంగా జరిగిన ఈ వివాహంతో ఆమెకి ఓ భర్తా... ఆమెకి పుట్టబోయే బిడ్డకి ఓ తండ్రీ లభిస్తారు... సుధీర్‌లో వచ్చిన ఈ మార్పు ఎప్పటికీ స్థిరంగా ఉండాలని ఓ ఆడపిల్ల తండ్రిగా కోరుకుంటున్నాను... అలా కానప్పుడు... తనకి జరిగిన అన్యాయాన్ని ఇంతలా ప్రతిఘటించిన గలిగిన నా బిడ్డ – జీవితంలో ఒంటరిపోరు సాగించలేని అశక్తురాలు కాదు! నాకిప్పుడు సంతోషాన్నీ, కొండంత నిబ్బరాన్నీ కలిగిస్తున్న విషయం యిదే! నా జీవితంలో ఎన్నో సందర్భాలలో గొంతు దాటి రాని స్వరం, నా బిడ్డ నోట వినిపించి, నాకెంతో గర్వంగానూ ఉంది...'' అన్నాడు.

*

పంతుల జోగారావు
9490139622

## కొన్ని నానీ పద చిత్రాలు



రైతు
ఒక రెక్కల పురుగు
వాన దీపం దగ్గర
రెక్కలు రాల్చుకున్నాడు.

*




ఆకలి చీకటిలో
చేను ఒకదీపం
వానేనా!
దానికి చమురు

*



ప్లాట్‌ఫామంత
పొడవైన ఆకలి,
కుళాయి అమ్మ
పాడింది నీటి జోల

*



కలువ కోసం
కాలు మోపానంతే
అద్దం
వెయ్యి వక్కలయింది

*



అల్లిన గూడు
చిరిగి పోయింది
అలుపెరగదు
సాలె పురుగు

*



నాలో కూడా
ఒక ఆశ
ఫ్యాక్టరీ పొగగొట్టం
అంచున పిట్టలా

*



ఆరో అంతస్తులో
ఒక పిట్ట
రెక్కలు మొలిచాయినాకు
చిత్రంగా

*



పత్తి పువ్వుతో పాటు
ప్రాణమొకటి రాలింది
వాన ధారా
ఒక వురే

–కోసూరి రవికుమార్